www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఎట్టకేలకు పట్టుబడిన సీఎస్‌డీటీ

పుత్తూరు కోర్టులో విష్ణును హాజరుపరిచిన పోలీసులు

అమానవీయ రాజకీయం

బాలికపై అత్యాచారం అంటూ నానా యాగీ

పరామర్శల పేరుతో హడావుడి

వైసీపీ నేతల తీరుపై జనంలో ఆగ్రహం

2



బుధవారం | 6-11-2024

Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తిరుపతి



కొలువుదీరనున్న కొత్త బోర్డు

నేడు టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు, 17 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త పాలక మండలి కొత్త అధ్యక్షుడు బీఆర్ నాయుడు, 17 మంది సభ్యులు నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మండపంలో వీరు బాధ్యతలు స్వీకరిస్తారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎండో మెంట్ కమిషనర్ సత్యనారాయణ కూడా నేడు ప్రమాణం చేస్తారు. తొలుత ఛైర్మన్, అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకార పత్రాలపై సంతకాలు చేశాక స్వామి దర్శనం చేసుకుంటారు. అనం తరం రంగనాయకుల మండపంలో వీకి శేషవ స్త్రాలు కప్పి వేద ఆశీర్వచనం చేస్తారు. కాగా సాయంత్రం అన్నమయ్య భవనంలో కొత్త పాలక మండలి మీడియా మీట్‌లో పాల్గొంటుంది. ప్రమాణస్వీకారానికి తగిన ఏర్పాట్లను టీటీడీ ఇప్పటికే పూర్తి చేసింది.

ఈ ప్రమాణస్వీకారం కోసం ఛైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం ఉదయం తిరుపతికి చేరుకున్నారు. తన సొంతూరైన పెనుమూరు మండలం దిగువపూనేపల్లికి వెళ్లి పూజలు చేశారు. తిరిగి తిరుమల చేరుకున్నారు. దారి పొడ వునా ఆయనకు ఘన స్వాగతం లభించింది.

వీరికి మళ్లీ అవకాశం

తాజా బోర్డులో మరోసారి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయబోతున్నవారిలో కృష్ణమూర్తి వైద్యనాథన్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, సౌరభ్ బోరా, సుచిత్ర ఎల్లా ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోనూ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి సభ్యులుగా ఉన్నారు. ఇక, మహారాష్ట్రకు చెందిన సౌరభ్ బోరా చివరి రెండు బోర్డుల్లో సభ్యుడిగా కొనసాగారు. అలాగే భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్ర ఎల్లా గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన బోర్డులో సభ్యురాలిగా ఉన్నారు. ఇక, కేంద్ర హోం మంత్రికి సన్నిహితుడుగా పేరున్న చెన్నైకు చెందిన కృష్ణ మూర్తి వైద్యనాథన్ 2015 నుంచి వరుసగా(ఐదుసార్లు) టీటీడీ బోర్డులో కొనసాగుతున్నారు.



బీఆర్ నాయుడికి స్వాగతం పలుకుతున్న విజిలెన్స్, రిసెప్షన్ అధికారులు

వారసులుగా ఇద్దరు

తిరుప్పూర్ బాలుగా పేరున్న బాలసుబ్రహ్మణియన్ పళనిస్వామి గత ప్రభుత్వంలో సభ్యుడిగా ఉన్నారు. అయితే ఈసారి ఆయన సోదరుడు రామ్మూర్తి బోర్డులో అవకాశం దక్కించుకున్నారు. అలాగే గత బోర్డులో సభ్యుడిగా ఉన్న కేతన్ దేశాయ్ కుమారుడు, కుసుమ్ ధీరజ్‌లాల్ ఆస్పత్రి ఎండీ అదిత్ దేశాయ్ కి ఈసారి అవకాశం లభించింది.

కొత్త బోర్డులో వీరు..

నూతన బోర్డులో టీడీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు సభ్యులుగా నియమితులయ్యారు. జ్యోతుల నెహ్రూ(జగ్గంపేట), వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి(కోవూరు) ఎంఎస్ రాజు(మడకశిర) స్థానం దక్కించుకున్నారు. మాజీ కేంద్రమంత్రి పన బాక లక్ష్మి తో పాటు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ సుచిత్ర ఎల్లా కూడా కొత్త పాలకమండలిలో ఉన్నారు. రాజమహేంద్రవరం సమీపంలోని రఘుదేవపురానికి చెందిన అక్కిన మునికోటేశ్వరరావు, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, పల్నాడు జిల్లాకు చెందిన జంగా కృష్ణమూర్తి, కుప్పం క్లస్టర్ ఇన్‌చార్జి వైద్యం శాంతారాం, మంగళగిరికి చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి కూడా సభ్యులుగా నియమితులయ్యారు. ఇక జనసేన నుంచి పవన్‌కల్యాణ్ సన్నిహితుడు, తెలంగాణ జనసేన ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్‌రెడ్డి, సినీ ఆర్ట్ డైరెక్టర్, పవన్‌కల్యాణ్ స్నేహితుడు బూరగాపు ఆనంద్‌సాయి, జనసేన పార్టీ వ్యవస్థాపక సభ్యురాలు అనుగోలు రంగశ్రీకి కొత్త బోర్డులో చోటు లభించింది. అలాగే ఫార్మా రంగంలో ఉన్న నాట్కో గ్రూప్ వైస్ ఛైర్మన్ నన్నపనేని సదాశివరావు, ఎస్‌ఆర్‌ఐ జాస్తి పూర్ణసాంబశివరావు, కర్ణాటక పారిశ్రామికవేత్తలు నరేష్‌కుమార్, కాఫీ రంగంలో ప్రముఖుడైన ఆర్ఎన్ దర్శన్, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి హెచ్ఎల్ దత్ సభ్యులుగా నియమితులయ్యారు. ఇక, తమిళనాడుకు చెందిన రామ్మూర్తి, ఎంసీఐ ఛైర్మన్‌గా పనిచేసిన గుజరాత్‌కు చెందిన కేతన్ దేశాయ్ కుమారుడు అదిత్‌దేశాయ్, మహారాష్ట్రకు చెందిన ఆర్థిక నిపుణుడు సౌరబ్ బోరా, కేంద్రమంత్రి అమిత్ షా సన్నిహితుడు కృష్ణమూర్తి వైద్యనాథన్ కూడా సభ్యులుగా స్థానం దక్కించుకున్నారు. స్థానికంగా ఉంటూ శ్రీవారి భక్తుల సమస్యలపై నిరంతరం స్పందించే బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి కూడా నూతన బోర్డులో ఉన్నారు.

వైసీపీలో వివాదాల బోర్డులు

జగన్ ప్రభుత్వంలో టీటీడీ పాలకమండలి నియామకాలు వివాదాలమయం అయ్యాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా నియమించారు. 2019 జూన్ 22 న వైవీ బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల తర్వాత టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అప్పట్లో ప్రభుత్వం 24 మంది సభ్యులు, నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, ఏడుగురు ప్రత్యేక ఆహ్వానితులతో బోర్డును ఏర్పాటు చేయటంపై కూడా పలువురు భక్తులు విమర్శలు చేశారు. అందులోనూ ప్రత్యేక ఆహ్వానితులతో కూడా ప్రమాణస్వీకారం చేయించి నూతన పద్ధతికి తెరతీశారు. 2021లో కేంద్ర క్యాబినేట్‌ను తలపించేలా వైసీపీ ప్రభుత్వం జంబో బోర్డును ఏర్పాటు చేయడంపై కూడా తీవ్రస్థాయిలో దుమారం రేగింది. రాజకీయ పునరావస కేంద్రంగా టీటీడీని మార్చుతూ గత సీఎం జగన్మోహన్‌రెడ్డి 29 మంది సభ్యులు, మరో 52 మంది ప్రత్యేక ఆహ్వానితులతో ఏకంగా 81 మందితో బోర్డును నియమించారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో కోర్టు ఆదేశాలతో ప్రత్యేక ఆహ్వానితుల నియామకానికి అడ్డుకట్టపడింది. పైగా ఆబోర్డులో ఆరుగురు నేర చరిత్ర కలిగిన వ్యక్తులు సభ్యులుగా ఉన్నారంటూ అప్పట్లో బీజేపీ కోర్టును కూడా ఆశ్రయించింది. అపార్టుమెంట్ల పేరుతో ప్రజలను మోసం చేశారంటూ ఆబోర్డులో సభ్యుడిగా ఉన్న లక్ష్మీనారాయణ అనే సభ్యుడిని అరెస్ట్ కూడా చేశారు. మరోవైపు మూడవ బోర్డుకు భూమన కరుణాకర్‌రెడ్డితో సహా 26 మందిని నియమించారు. ఈ పాలకమండలి నిర్ణయాలన్నీ వివాదాస్పదమే అయ్యాయి. రాజకీయ లబ్ధి కోసం టీటీడీ నిధులతో తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణాలు, అవసరం లేకపోయిన విశ్రాంతి గృహాల నిర్మాణం వంటివి విమర్శలకు గురయ్యాయి.

వైసీపీకి బిగ్ షాక్!

టీడీపీలో చేరిన కుప్పం మున్సిపల్ ఛైర్మన్

ముందే పురపాలక పదవులకు రాజీనామా

ఇప్పటికే వైసీపీని వీడిన ఆరుగురు కౌన్సిలర్లు



చంద్రబాబుతో డాక్టర్ సుధీర్ తదితరులు

కుప్పం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.ఇప్పటికే వైసీపీ తరపున గెలిచిన ఆరుగురు కౌన్సిలర్లు కూడా టీడీపీలో చేరిపోయిన విషయం తెలిసిందే. దీంతో కుప్పం మున్సిపాలిటీని క్లీన్ స్వీప్ చేసే దిశగా టీడీపీ కదులుతోంది. కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ అమరావతిలోని ఉండవల్లిలో గల నివాసంలో మంగళవారం తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును సతీసమేతంగా కలిశారు.ఆయన సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. చేరడానికి ముందే మున్సిపల్ ఛైర్మన్ పదవితో పాటు,16వ వార్డునుంచి గెలిచిన కౌన్సిలర్ పదవికి కూడా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు. సుధీర్‌కు పసుపు కండువా కప్పి పార్టీలోకి చంద్రబాబు ఆహ్వానించారు. కుప్పం మున్సిపాలిటీలో మొత్తం 25 వార్డులున్నాయి. 2021 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో వైసీపీనుంచి 19 మంది, టీడీపీ నుంచి ఆరుగురు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. 16వ వార్డునుంచి కౌన్సిలర్‌గా ఎన్నికైన డాక్టర్ సుధీర్‌ను ముందుగానే ఛైర్మన్ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన ఛైర్మన్‌గా ఏర్పడిన మున్సిపల్ కౌన్సిల్ వైసీపీ హస్తగతమైంది. అయితే ఇటీవల వైసీపీ కౌన్సిలర్లు ఆరుగురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.మున్సిపల్ ఛైర్మన్ సుధీర్ కూడా కొంతమంది కౌన్సిలర్లతో అమరావతి వెళ్లి టీడీపీలో చేరడానికి ప్రయత్నాలు చేశారు. అయితే స్థానికంగా కొంతమంది టీడీపీ నేతలు వ్యతిరేకించడంతో ఆయన చేరిక వాయిదా పడింది. అనంతరం జరిగిన పరిణామాల్లో మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తేనే పార్టీలో చేర్చుకుంటామన్న సందేశం అందింది. దీంతో ఆయన పదవులను వదులుకుని మరీ ప్రస్తుతం టీడీపీలో చేరారు. దీంతో ఆ వైసీపీకి కేవలం 12 మంది కౌన్సిలర్లు మాత్రం మిగిలారు. వీరిలో కూడా చాలామంది టీడీపీలో చేరడానికి ఆతృతగా ఉన్నారు కానీ, అధిష్ఠానం ఊ అంటే ఇప్పటికిప్పుడు కుప్పం మున్సిపల్ కౌన్సిల్‌లో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది.

సింగిల్‌విండోలను బలోపేతం చేయండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(సింగిల్ విండోల)ను బలోపేతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మండలస్థాయిలో కొనసాగుతున్న సింగిల్‌విండోలను భవిష్యత్‌లో గ్రామస్థాయిలో ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో కేంద్రం ఉందని చెప్పారు. అందువల్ల వీటి ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా చూడాలన్నారు. వ్యవసాయరంగానికే పరిమిత సేవలు అందిస్తున్న వీటిని మత్స్య, పాడిపరిశ్రమ అభివృద్ధికి విస్తరించాలన్నారు. నాబార్డు నిధులతో నిర్మించిన గోదాములను ఐసీడీఎస్, హౌసింగ్ శాఖలకు అద్దెకు ఇవ్వాలని సూచించారు. కమిటీ కన్వీనర్, డీసీవో నాగవర్ధన మాట్లాడుతూ జిల్లాలో 37 సింగిల్‌విండోలు పనిచేస్తుండగా, 3.60 లక్షల మంది రైతుల్లో 1.90 లక్షల మంది మాత్రమే పూర్తి షేర్ ధనం చెల్లించి సభ్యులుగా ఉన్నారని తెలిపారు. జేసీ విద్యాధరి, నాబార్డు డీడీఎం సునీల్‌కుమార్, డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు మురళీకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఖాతాలోకి త్వరలో రామకుప్పం ఎంపీపీ పదవి

రామకుప్పం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):రామకుప్పం మండల పరిషత్ అధ్యక్ష పదవి టీడీపీ ఖాతాలోకి వెళ్లడం ఖాయమైనట్టే. ప్రత్యేక పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ గత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు దూరంగా ఉండాలన్న నిర్ణయంతో రామకుప్పం మండలంలో కూడా టీడీపీ అభ్యర్థులు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. దీంతో మండలంలోని 17ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులే ఎన్నికయ్యారు. మణీంద్రం ఎంపీటీసీగా ఎన్నికైన వైసీపీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి భార్య శాంతకుమారి ఎంపీపీగా ఎన్నికయ్యారు. రెండేళ్ల క్రితం ఆమె అనారోగ్యంతో మృతి చెందగా వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం ఎంపీపీ అయ్యారు.టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలు రామకుప్పం ఎంపీపీ స్థానంపై దృష్టి సారించారు.ప్రస్తుతమున్న 16మంది ఎంపీటీసీల్లో ఏడుగురు మంగళవారం టీడీపీలో చేరినట్టయింది. ఎంపీపీ పదవిని చేజిక్కించుకోవాలంటే టీడీపీకి 9మంది ఎంపీటీసీల మద్దతు అవసరం.మణీంద్రం ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎన్నికైతే టీడీపీ బలం 8కి పెరుగుతుంది. అప్పుడు టీడీపీకి మరో ఎంపీటీసీ మద్దతు అవసరమవుతుంది. ప్రసుత్తం వైసీపీలో ఉన్న 8మంది ఎంపీటీసీల్లో ఇద్దరు ఎంపీపీ ఎన్నికలో టీడీపీకి సహకరిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం.ఇక టీడీపీలో ఎంపీపీ పదవిపై దాదాపు ఏకాభిప్రాయం కుదిరినట్టు తెలిసింది.గతంలో ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించిన పార్టీ సీనియర్ నేత రామ్మూర్తి భార్య సులోచనమ్మకే ఆ పదవి కట్టబెట్టాలని నియోజకవర్గ సమన్వయ కమిటీ తీర్మానించినట్టు పార్టీ నేతలు తెలిపారు. ఇదే విషయమై తాను సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించినట్టు రామ్మూర్తి తెలిపారు.మణీంద్రం ఎంపీటీసీ ఎన్నికలు జరిగితే ఈ విషయంలో మరింత స్పష్టత వస్తుందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

'ఆయుష్మాన్' నమోదు ప్రక్రియ వేగవంతం కావాలి

యాదమరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ ఆదేశించారు. మంగళవారం యాదమరి పీహెచ్‌సీని తనిఖీ చేశాక సిబ్బందితో సమావేశమయ్యారు.70ఏళ్లు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు గురించి వివరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్డు కలిగిన పేదలకు రూ.5 లక్షల వరకు ఉచిత బీమా సదుపాయం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేఖ, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.





తిరుమల రెండో ఘాట్‌రోడ్డు పక్కన ఉన్న ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్, గుట్కా ప్యాకెట్లు



ఇదేంది స్వామి!

తిరుమలకు మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీ, గుట్కా, హన్స్ వంటివి నిషేధం. వీటిని అలిపిరి భద్రత తనిఖీల్లోనే గుర్తించి అడ్డుకోవాలి. కానీ భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంతో తరచూ తిరుమలకు నిషేధిత వస్తువులు వస్తూనే ఉన్నాయి. ఈక్రమంలోనే తిరుమలకు వెళ్లే రెండో ఘాట్ రోడ్డులో వినాయక స్వామి ఆలయం దాటాక వచ్చే షెడ్డుకు సమీపంలో ఇలా తాగి పడేసిన మద్యం సీసాలు, వాడేసిన గుట్కా, హన్స్, సిగరెట్ ప్యాకెట్లు భారీగా పడున్నాయి. ఒకే ప్రాంతంలో పోగేసినట్టుగా ఉన్న వీటిని చూసి భక్తులు విస్మయం చెందుతున్నారు. భక్తుల సమాచారంతో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పెద్దశేషవాహనంపై మలయప్ప


నాగుల చవితి సందర్భంగా మంగళవారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్ప స్వామి పెద్దశేష వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. విశేష అలంకరణలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఎన్నికల్లో ఘోరంగా అధికారం కోల్పోయిన జగన్ పార్టీ అత్యాచార రాజకీయాలకు తెర లేపింది. ఎర్రావారిపాళెం మండలంలో సోమవారం రాత్రి జరిగిన ఒక సంఘటనపై నానా యాగీ చేసింది. నిజానిజాలు తెలుసుకోకుండా 14 ఏళ్ల బాలిక భవిష్యత్తును రచ్చకెక్కించేందుకు తెగబడింది. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించే పేరుతో నాయకులంతా క్యూకట్టారు. హడావుడి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం విఫలమైపోయిందంటూ వీరంగాలు వేశారు. చివరికి పదో తరగతి చదువుతున్న బాలిక తండ్రి చేతులు జోడించి..' నా బిడ్డమీద ఎటువంటి అత్యాచారం జరగలేదు. నా బిడ్డ భవిష్యత్తును పాడు చేయద్దు స్వాములాలా' అని కన్నీటితో వేడుకోవాల్సి వచ్చింది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



నా బిడ్డపై ఎటువంటి అత్యాచారం జరగలేదు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వేధింపులకు మాత్రమే పాల్పడ్డారు. అయితే మీడియాలో, కొందరు రాజకీయ నేతలూ నా బిడ్డపై అత్యాచారం జరిగిందని తప్పుడు ప్రచారాలు చేస్తూ మా పరువు తీస్తున్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా నా బిడ్డ భవిష్యత్తును నాశనం చేయకండి.

- బాలిక తండ్రి



అత్యాచారం అబద్ధం: ఎస్పీ

14 ఏళ్ల విద్యార్థినిపై ఎటువంటి అత్యాచారం జరగలేదని వైద్య పరీక్షల్లో వైద్యులు స్పష్టంగా నిర్ధారించారు. పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థినిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డుకొని ప్రేమించాలని వేధింపులకు పాల్పడ్డారు. కొన్ని పత్రికల్లో రాసినట్లు, కొందరు నేతలు పేర్కొంటున్నట్లు బాలికపై ఎటువంటి అత్యాచారం జరగలేదు. ఇటువంటి సున్నితమైన విషయాల గురించి మాట్లాడే ముందు నిజనిజాలు పూర్తిగా తెలుసుకోవాలి. మీడియా కూడా ఎలాంటి ఆధారాలు, అధికారుల వివరణ లేకుండా అసత్యాలు ప్రసారం చేయడం మంచిది కాదు.బాలికను వేధింపులకు గురిచేసిన వారిని తప్పక అదుపులోకి తీసుకొని తగు చర్యలు చేపడతాం.

- సుబ్బారాయుడు, జిల్లా ఎస్పీ



అమానవీయ రాజకీయం

బాలికపై అత్యాచారం అంటూ నానా యాగీ

పరామర్శల పేరుతో హడావుడి - వైసీపీ నేతల తీరుపై జనంలో ఆగ్రహం

మీకు మానవత్వం లేదా: పులివర్తి నాని

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అక్కడ వైసీపీ నేతల తీరును దుయ్యబట్టారు. పబ్లిసిటీ కోసం వైసీపీ సోషల్ మీడియాతో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మానవత్వం లేకుండా బాలిక విషయంలో అసత్యాలను ప్రచారం చేయించారని ఆరోపించారు. ఉదయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్, మంత్రి లోకేష్ ఫోన్ చేస్తూ ఎప్పటికప్పుడు బాలిక పరిస్థితి, వివరాలను అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రతీ ఒక్కరిపై తప్పక చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

ఆస్పత్రి వద్ద వైసీపీ నేతల హల్‌చల్

ప్రసూతి ఆసుపత్రికి ఉదయమే పులివర్తి సుధారెడ్డి చేరుకొని మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి బాలికను పరామర్శించి, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వీరిని పోలీసులు ఆస్పత్రిలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. సాధారణంగా మగవారిని ప్రసూతి ఆస్పత్రిలోకి అనుమతించరు. దీంతో వారు ఆస్పత్రి ముందు బైఠాయించారు. బాలికను పరామర్శించి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన మాజీ మంత్రి రోజా తన సహజ ధోరణిలో ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.



ప్రసూతి ఆస్పత్రి ముందు బైఠాయించిన వైసీపీ నేతలు, మీడియాతో మాట్లాడుతున్న రోజా

కస్తూర్బా గాంధీ పాఠశాలలో సీటు కేటాయింపు

తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: యర్రావారిపాళెం మండలంలో దాడికి గురైన బాలిక.. తదుపరి విద్యను కొనసాగించేందుకు అక్కడి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సీటు కేటాయించినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె చదువు కొనసాగించడానికి తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.



ఎట్టకేలకు పట్టుబడిన సీఎస్‌డీటీ విష్ణు

పుత్తూరు కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

రేషన్ బియ్యం అక్రమాల్లో కడప, నగరి, ఏర్పేడు బియ్యం వ్యాపారుల భాగస్వామ్యం

మరో పౌరసరఫరాల శాఖ అధికారి కూడా

5,040 బస్తాల అమ్మకంతో రూ.29.70 లక్షల ఆర్జన

పుత్తూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాములో రేషన్ బియ్యం అక్రమంగా తరలించిన సీఎస్‌డీటీ సీహెచ్ విష్ణు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. సోమవారం పట్టుబడిన ఇతడిని మంగళవారం రిమాండ్ నిమిత్తం పుత్తూరులోని ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. పుత్తూరు ఎస్డీపీవో రవికుమార్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించనున్నట్లు సీఐ కె.వి.సురేంద్రనాయుడు తెలిపారు. పుత్తూరు, పిచ్చాటూరు పౌరసరఫరాల శాఖ మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లలో సీఎస్‌డీటీగా సీహెచ్ విష్ణు 2022 డిసెంబరు నుంచి 2024 ఆగస్టు వరకు విధులు నిర్వహించాడన్నారు. గోడౌన్ల నుంచి సుమారు 4,056 రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా విక్రయించినట్లు గుర్తించామన్నారు. ఉద్యోగ బాధ్యతలను విస్మరించి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టాడనే నేరారోపణలపై అరెస్టు చేశామన్నారు. ఆహార భద్రతా చట్టం -1955 అండర్ సెక్షన్ 314, 316, 316(5), 318(4), 7(1) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమాల్లో బియ్యం వ్యాపారుల భాగస్వామ్యం

రేషన్ బియ్యం అక్రమాల్లో కడప, నగరి, ఏర్పేడుకు చెందిన కొందరు బియ్యం వ్యాపారులతో పాటు పౌరసరఫరాల శాఖకు చెందిన మరో అధికారి భాగస్వామ్యం ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. పుత్తూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి 2,840 బియ్యం బస్తాలు విక్రయించి రూ.14.90 లక్షలు, పిచ్చాటూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి 2,200 బస్తాలు విక్రయించి రూ.14.80 లక్షలు అక్రమంగా ఆర్జించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

అప్పులకు.. విలాసాలకు..

ఈ అక్రమ సంపాదనను సీఎస్‌డీటీ విష్ణు తాను చేసిన అప్పులకు గాను నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డికి రూ.14 లక్షలు, పాపిరెడ్డికి రూ.1.50 లక్షలు, గూడూరుకు చెందిన రమణరాజుకు రూ.1.50 లక్షలు, చెన్నైకి చెందిన మరి కొందరి నగదు రూపంలో చెల్లించినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకొన్నట్లు తెలిసింది. ఇక, విలాసాలకు ఖర్చు చేసిన మొత్తం ఎంతనేది లెక్క తేలలేదని పోలీసులు అంటున్నారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలంలోని తన సొంతూరు రాజుపాళెంలో ఒక ఇల్లు, రెండు రేకుల షెడ్లు, బైక్ ఉందని, తన తల్లి పేరున ఎకరా మామిడి తోట ఉన్నట్లు విచారణలో విష్ణు చెప్పినట్లు సమాచారం.



చికిత్స పొందుతున్న సతీష్, గణేష్

కత్తితో ఆటో డ్రైవరు వీరంగం

స్నేహితుడి కుటుంబంపై దాడితో ముగ్గురికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తిలో కలకలం



చికిత్స పొందుతున్న కీర్తన

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ కత్తితో విచక్షణా రహితంగా రెచ్చిపోయాడు. వేకువ జామున 4 గంటల సమయంలో స్నేహితుడి ఇంటికెళ్లి హత్యాయత్నానికి తెగబడ్డాడు. అడ్డుకున్న అతడి భార్య, మామనూ గాయపరిచాడు. రక్తం కారుతుండగా ముగ్గురూ పోలీసు స్టేషనుకు పరుగు తీశారు. తెల్లారేసరికి పట్టణ ప్రధాన రహదారిలో కనిపించిన రక్తపు మరకలతో శ్రీకాళహస్తిలో కలకలం రేగింది.

పట్టణంలోని జెట్టిపాళేనికి చెందిన సతీష్, ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన మణి ఆటో డ్రైవర్లు. వీరిద్దరూ స్నేహితులు. మద్యంమత్తులో తరచూ వాగ్వాదం చోటు చేసుకునేది. సోమవారం రాత్రి ముత్యాలమ్మ గుడి వీధిలో మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో మంగళవారం వేకువన నాలుగున్నర గంటల సమయంలో కత్తి చేత పట్టుకున్న మణి.. జెట్టిపాళెంలోని సతీష్ ఇంటికెళ్లి తలుపు కొట్టాడు. వెలుపలకు వచ్చిన సతీష్‌పై కత్తితో దాడి చేశాడు. అరుపులు విన్న కీర్తన.. తన భర్తను కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమెపైనా నిందితుడు కత్తితో దాడి చేశాడు. కీర్తన తండ్రి గణేష్ వచ్చి మణిని అదుపు చేసేందుకు ప్రయత్నించగా, అతడిపైనా దాడి చేశాడు. దీంతో రక్తం కారుతుండా ముగ్గురూ జెట్టిపాళెం నుంచి పెళ్లి మండపం మీదుగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు పరుగుతీశారు. వెంటనే వీరిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కు పొట్ట పైన, కీర్తనకు నడుము కింద, గణేష్‌కు చేతిపైన కత్తిపోట్లతో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఈ ఘటనపై శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న మణి కోసం గాలిస్తున్నారు. బాధితులు పరుగు తీసిన రోడ్డంతా రక్తపు మరకలయ్యాయి.



బీఆర్ నాయుడికి స్వాగతం పలుకుతూ తిరుపతిలో భారీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి ఘన స్వాగతం

తిరుపతిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాకు వచ్చిన నేపథ్యంలో అభిమానులు వినూత్నరీతిలో స్వాగతం పలికారు. రాజమండ్రికి చెందిన ఆయనకు కోనేరు మురళి, తూర్పుగోదావరి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కురుకూరి కిషోర్ నేతృత్వంలో రేణిగుంట విమానాశ్రయం నుంచి అలిపిరివరకు.. అక్కడ్నుంచి ఆయన ఇంటి వరకు దారిపొడవునా పెద్దఎత్తున్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి సాదర స్వాగతం పలికారు. అలాగే, తిరుపతిలోని ఆయన నివాసం వరకూ ఫ్లెక్సీలు, బ్యానర్లను కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోండి



తిరుపతి కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యసంరక్షణ కోసం బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా మరింత అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మహిళలలో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు సంబంధించి స్వీయ పరీక్ష పోస్టర్‌ని మంగళవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశాఖ, పరివర్తన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు స్వీయ పరీక్ష చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలతోపాటు చికిత్స పొందాలని తెలిపారు. సి.హెచ్, పరివర్తన సంస్థల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దీనిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు సాయి ధరమ్‌తేజ్

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సినీ హీరో సాయి ధరమ్‌తేజ్ మంగళవారం రాత్రి 11 గంటలకు తిరుమలకు వచ్చారు. అలిపిరి నుంచి కాలినడకను వచ్చిన ఆయనకు జీఎన్సీ వద్ద స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఫీనిక్స్ అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. బుధవారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఆర్టీసీ అప్రెంటీస్‌షిప్‌నకు 13 నుంచి ఇంటర్వ్యూలు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న తిరుపతి, చిత్తూరు జిల్లాల అభ్యర్థులకు 15న ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఈ మేరకు ఇన్‌చార్జి డీపీటీవో జగదీష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూ కోసం రెజ్యూమ్, ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, 10వ తరగతి, ఐటీఐ మార్కులలిస్టులు, కులధృవీకరణ పత్రం, వికలాంగులు, మాజీ సైనికుల పిల్లలైతే ఆచా సర్టిఫికెట్లు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌కు సంబంధించిన ధృవీకరణపత్రం, ఆధార్, అన్ని ఒరిజినల్స్ తీసుకు రావాలని పేర్కొన్నారు. నెల్లూరు సమీపంలోని కాకుటూరులో ఉన్న ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలకు హాజరు కావాల్సి ఉంది.

శిల్పారామంలో సీఈవో తనిఖీ



శిల్పారామంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఈవో స్వామినాయుడు

తిరుచానూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శిల్పారామాన్ని మంగళవారం ఏపీ రాష్ట్ర శిల్పారామం సీఈవో వి.స్వామినాయుడు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రమాదం జరిగిన ప్రదేశంపై ఆరాతీసి, ఇకపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన క్రాస్‌వీల్, జాయింట్ వీల్, లిఫ్ట్ మగ్రమెంట్ అనుమతులు రద్దుచేయాలని ఆదేశించారు. పిల్లలు ఆడుకునేందుకు ప్రమాదాలకు అవకాశాలు లేనివాటిని మాత్రమే అనుమతించాలని, ల్యాండ్ స్కేపింగ్‌ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని శిల్పారామాలకు ఇదే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. శిల్పారామం అభివృద్ధికి కావాల్సిన అనుమతులకోసం వెంటనే నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఏవో, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

తిరుమలకు వస్తే పాజిటివ్ ఫీలింగ్



అనన్య నాగళ్ల

తిరుమల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ఎప్పుడు వచ్చినా మంచి పాజిటివ్ ఫీలింగ్ వస్తుందని సినీనటి అనన్య నాగళ్ల అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పొట్టేల్' చిత్రం తనకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. త్వరలో మంచి ప్రాజెక్టులు చేయనున్న క్రమంలో స్వామి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు.

ఎనిమిది అడుగుల జెర్రిపోతు

తిరుమల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుమల జీఎన్సీ గార్డెన్‌లోని ఓ గదిలోకి మంగళవారం సుమారు ఎనిమిది అడుగుల జెర్రిపోతు చొరబడింది. పామును గుర్తించిన గార్డెన్ సిబ్బంది వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకోవడంతో అక్కడివారు ఊపిరిపీల్చుకున్నారు. అలాగే రింగురోడ్డులోని డ్రైనేజ్ వాటర్ ప్లాంట్ వద్ద మరో నాలుగు అడుగుల పొడవైన నాగుపామును కూడా భాస్కర్ పట్టుకున్నారు. ఈ రెండింటినీ దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.




తమలపాకు, చిక్కుడు చెట్లు


అరటిగెల


అరటి చెట్లు


వంకాయ చెట్లు


గోంగూర

శెభాష్ గార్డెన్

హాస్టల్ ఆవరణలో కూరగాయలు, ఆకుకూరల పెంపకం

వంట చేయించి విద్యార్థులకు పెడుతున్న వైనం

పూతలపట్టులోని ఎస్సీ బాలుర హాస్టల్ ఆవరణం ఎప్పుడూ పచ్చదనం పరుచుకుని ఉంటుంది. ఇక్కడి వార్డెన్ జయచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఖాళీ స్థలంలో కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల మొక్కలను సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్నారు. పండిన కూరగాయలతో వంట చేయించి, హాస్టల్‌లోని 47 మంది విద్యార్థులకు పెడుతున్నారు. అలాగే పరిశుభ్రతకు పెద్దపీట వేయడమే కాకుండా, ఉత్తమ ఫలితాలూ సాధిస్తుండటంతో అందరితోనూ శెభాష్ అనిపించుకుంటున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పైనా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అవసరమైన వారికి విద్యాసామగ్రిని కూడా సమకూరుస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- పూతలపట్టు, ఆంధ్రజ్యోతి


పలురకాల మొక్కలు

ఆధునిక పద్ధతులు అనుసరించండి

చెరకు సాగుపై రైతులకు పద్మశ్రీ భక్షీరామ్ అవగాహన


సదస్సులో ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త భక్షీరామ్

నగరి/విజయపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్త పద్ధతులతో చెరకు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని పద్మశ్రీ అవార్డు గ్రహీత, శాస్త్రవేత్త డాక్టర్ భక్షీరామ్ తెలిపారు. నగరి, పిచ్చాటూరు డివిజన్ చెరకు రైతుల అవగాహన సదస్సు విజయపురం మండలంలోని మంగళంకండ్రిగ రోడ్డు వద్ద సాగర్ చక్కెర కర్మాగార (ఎస్ఎన్‌జే) యాజమాన్యం నిర్వహించింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాధారణ పద్ధతిలో 2.5 అడుగుల వెడల్పుతో బోదె తోలి చెరకు నాటుతున్నారన్నారు. అలాకాకుండా 4.5 అడుగుల వెడల్పుతో బోదె తోలి చెరకు విత్తినట్లయితే ఎకరాకు 60 నుంచి 70టన్నుల దిగుబడి సాధించవచ్చన్నారు. పైగా యాంత్రీకరణతో హార్వెస్టింగ్ చేయవచ్చని.. విత్తనం కూడా ఎకరాకు రెండు టన్నులే సరిపోతుందన్నారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గుతుందని వివరించారు. వీలైనంత వరకు సూపర్ ఫాస్పేట్, యూరియా, పొటాష్ వంటి ఎరువులను నాలుగు విడతలుగా వాడాలని సూచించారు. బోదె తోలకముందు దుక్కిలో ఓసారి, 45 రోజులకు రెండోసారి, 90 రోజులకు మూడోసారి, 120 రోజులకు నాల్గవసారి ఎరువులను వాడాలన్నారు. కో18009, కో86032, కో1105, కో14012, 2016టీ7 చెరకును విత్తినట్లయితే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఎస్ఎన్‌జే అడ్వయిజర్ కృష్ణన్, ఏజీఎం వరదరాజన్ మాట్లాడుతూ.. మూడు అడుగుల వెడల్పుతో బోదె తోలి చెరకు విత్తితే ఎకరాకు రూ.5,000, 4.5 అడుగుల వెడల్పుతో విత్తితే ఎకరాకు రూ.10,000 సబ్సిడీ రూపంలో అందిస్తామన్నారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్లో రవాణా చార్జీలు రూ.127 రైతులు చెల్లిస్తే మిగిలిన ఖర్చులన్నీ ఎస్ఎన్‌జే యాజమాన్యం భరించి టన్నుకు రూ.3,151 ఇస్తోందన్నారు. ఏవోలు రవికుమార్, అరుల్‌జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డిఫెన్స్ లిక్కర్ విక్రయిస్తే కార్డులు రద్దు చేయిస్తాం



పుంగనూరు రూరల్, నవంబరు5(ఆంధ్రజ్యోతి) : ఆర్మీలో పనిచేసిన వారు ప్రభుత్వం అందించే డిఫెన్స్ లిక్కర్‌ను బయట విక్రయిస్తే వారి లైసెన్స్‌లు(కార్డులు)లను రద్దు చేయిస్తామని చిత్తూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ హెచ్చరించారు. మంగళవారం పుంగనూరు ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉన్న 331మద్యం షాపుల ముందు ధరల పట్టిక తప్పని సరిగా ఏర్పాటు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. బెల్టు షాపులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. బెల్టుషాపులు నిర్వహించి రెండు, మూడు సార్లు పట్టుబడితే వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ ట్రోఫీకి పలమనేరు యువకుడు


చక్రి

పలమనేరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్వహించనున్న సంతోష్ ట్రోఫీ సీనియర్ పురుషుల విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు పలమనేరుకు చెందిన చక్రి ఎంపికయ్యారని ఇక్కడి ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 19 వ తేదీ వరకు అనంతపురం జిల్లా వేదికగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నవీన్ కుమార్ తెలిపారు. చక్రిని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు, అసోసియేషన్ కార్యదర్శి, దిలీప్‌కుమార్, కోచ్ విక్రంరాజ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ హేమంత్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి కిషోర్ కుమార్ తదితరులు అభినందించారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

చిత్తూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ కార్యాలయంలో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఈఈ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐరాల, తవణంపల్లె, బంగారుపాళ్యం, యాదమరి మండలాలకు చెందిన విద్యుత్‌శాఖ అధికారులు హాజరవుతారని వివరించారు. వినియోగదారులు తమ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

కన్‌స్ట్రక్షన్ డీఈ బదిలీ : చిత్తూరు విద్యుత్ శాఖలో కన్‌స్ట్రక్షన్ డీఈగా పనిచేస్తున్న జ్ఞానేశ్వర్‌ను రాయచోటికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ పనిచేస్తున్న రెడ్డికుమార్‌ను చిత్తూరుకు బదిలీ చేశారు.

15న ఆర్టీసీలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

చిత్తూరు రూరల్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 15వ తేదీన నెల్లూరు జిల్లా కాకుటూరులోని సంస్థ శిక్షణ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఆర్ఎం జగదీష్ తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అప్లికేషన్, టెన్త్, ఐటీఐ మార్కుల లిస్టులు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ కార్డుతో హాజరవ్వాలని పేర్కొన్నారు. వివరాలకు 91542 91408 నెంబరును సంప్రదించాలని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

ఉద్యోగాలకు 73 మంది ఎంపిక


సమావేశంలో ప్రసంగిస్తున్న పద్మజ

చిత్తూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ, సీడాప్, డీఆర్డీఏల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళాను నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జరిగిన ఈ మేళాలో ఐదు బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయని జిల్లా ఉపాధి అధికారి పద్మజ తెలిపారు. మొత్తం 149 మంది అభ్యర్థులు హాజరైతే 73 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి, రీజనల్ ప్లేస్మెంట్ అధికారి యుగంధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశుగణన



చిత్తూరు సెంట్రల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 21వ జాతీయ పశుగణన కొనసాగుతోంది. మంగళవారం చిత్తూరులోని బీవీరెడ్డి కాలనీ, భరత్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన పశుగణనను పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 982 గ్రామాల్లో పశుగణన జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు 445 గ్రామా(45.32 శాతం)ల్లో ప్రక్రియ ప్రారంభమైనట్లు చెప్పారు. 537 గ్రామాల్లో చేపట్టాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి


మునిరత్నం (ఫైల్‌ఫొటో)

యాదమరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ టీడీపీ కార్యకర్త మృతి చెందాడు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని కాశిరాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మునిరత్నం (60) పూతలపట్టులో మంగళవారం నిర్వహించిన పార్టీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఇంటికి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలోని జోడిచింతల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపానికి వచ్చేసరికి పద్మనాభంసాదు అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొనడంతో మునిరత్నం తలకు బలమైన గాయమైంది. బాధితుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మునిరత్నం కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. రోడ్డు మరమ్మతులు చేయని కారణంగా రోజూ పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళా కార్పొరేటర్ సహా మరో ఇద్దరిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీల్లో తలెత్తిన వివాదం కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనలో ఓ మహిళా కార్పొరేటర్, మరో ఇద్దరిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కొండమిట్టకు చెందిన హరికృష్ణకు ఓ కారు ఉండేది. ఆ కారును బాలాజి అనే వ్యక్తి మధ్యవర్తిగా ఉండి విక్రయించి, ఆ డబ్బును హరికృష్ణకు ఇవ్వలేదు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వ్యవహారంలో ఆ మహిళా కార్పొరేటర్, ఆమె తండ్రి జోక్యం చేసుకుని హరికృష్ణకు డబ్బులిచ్చేది లేదని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ కారణంగా వారం రోజుల క్రితం హరికృష్ణ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ ఈనెల రెండో తేదీన ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ మేరకు హరికృష్ణ చెల్లెలు ఇచ్చిన ఫిర్యాదుతో కార్పొరేటర్‌సహా మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరద బాధితులకు రూ.17లక్షల విరాళం

డీడీని సీఎంకు అందజేసిన టీడీపీ నేతలు


విరాళం అందిస్తున్న రామకుప్పం నాయకులు

రామకుప్పం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల కోసం రామకుప్పం మండల టీడీపీ శ్రేణులు, ప్రజలునుంచి రూ.17,17,175 విరాళాలు సేకరించినట్లు టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, సీనియర్‌నాయకులు రామ్మూర్తి, కృష్ణానాయక్, మహ్మద్‌రఫీ, మనోహర్, నందారెడ్డి, సలాంసాబ్ తెలిపారు. విరాళ మొత్తం డీడీని మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఇదిలా ఉండగా విజలాపురానికి చెందిన పార్టీ సీనియర్ నేత శ్రీనివాసులురెడ్డి వరద బాధితులకు రూ.5వేల విరాళం సీఎం చంద్రబాబుకు అందజేశారు.

కూటమి ప్రభుత్వంపై వైసీపీవన్నీ అసత్య ఆరోపణలే : టీడీపీ

చిత్తూరు సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు, ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ పాలనలో రెండు వేలకు పైగా మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరిగినా.. జగన్ రెడ్డి, రోజాసహా ఏ మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కొన్ని దురదృష్టకర సంఘటనలపై సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలుస్తున్నారన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి, బాధితులను పరామర్శించి, వారి కుటుంబాలను ఆదుకుంటున్నారని వివరించారు. ఐదు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు అసూయతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆ ప్రకటనలో వివరించారు.

9న శ్రీవారి ఆలయంలో పుష్పయాగం

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9వ తేదీన పుష్పయాగం శాస్త్రోక్తంగా జరుగనుంది. ఈమేరకు 8వ తేదీన రాత్రి 8 నుంచి 9 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. ఈసేవ కారణంగా 8న సహస్రదీపాలంకార సేవ, 9న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. అలాగే తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

అట్టహాసంగా ఎస్వీయూ మహిళా అంతర కళాశాలల క్రీడా పోటీలు


వాలీబాల్ విన్నర్స్ ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల జట్టుకు షీల్డ్ అందిస్తున్న వైస్ చాన్సలర్ అప్పారావు - ఖోఖో రన్నర్స్‌గా ఎస్వీయూ డిగ్రీ కళాశాల జట్టు

తిరుపతి(క్రీడలు), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మహిళా అంతర్ కళాశాలల క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. స్థానిక ఎస్వీయూ మైదానంలో వ్యాయామ విభాగాధిపతి ఆచార్య ఎం.శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. విజేత జట్లకు ఎస్వీయూ వైస్ చాన్సలర్ సి.హెచ్.అప్పారావు, షీల్డ్, ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేశారు. వాలీబాల్‌లో మదనపల్లె ప్రభుత్వ కళాశాలపై ఎస్వీడబ్ల్యూ డిగ్రీకళాశాల(తిరుపతి), బ్యాడ్మింటన్‌లో ఎస్వీడబ్ల్యూ డిగ్రీకళాశాల(తిరుపతి)పై శ్రీకాళహస్తి ప్రభుత్వ కళాశాల, ఖోఖోలో ఎస్వీయూ డిగ్రీకళాశాల(తిరుపతి)పై ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల(తిరుపతి) విజయం సాధించాయి.

పంట పొలాలపై ఏనుగుల దాడి


ధ్వంసమైన మామిడి తోట

పాకాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాకాలచమండలంలోని చంద్రగిరివారిపల్లె, ఎస్టీ కాలనీ వరదప్పనాయుడుపేట, పల్లివేడు, ఈపాలగుట్టపల్లె గ్రామాల పరిసరాల్లో సోమవారం రాత్రి పంటపొలాలపై ఏనుగులు దాడి చేశాయి. మామిడి, పనస చెట్లు విరిచేశాయి. పైపులైన్లు ధ్వంసం చేశాయి. రాత్రి గ్రామాల నుంచి బయటికి రావాలంటే ఏనుగుల మంద దాడి చేస్తుందేమోనని భయంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. వీటి బారినుండి రక్షించి తమకు పంటనష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

ప్రేమించలేదని యువతి ఇంటిపై ట్యాక్సీ డ్రైవర్ దాడి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తన ప్రేమను అంగీకరించలేదనే ఆగ్రహంతో ఒక యువకుడు కొంతమంది స్నేహితులతో కలిసి యువతి ఇంటిపై దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి స్థానిక వాసవీనగర్‌లో చోటు చేసుకుంది. తిరుపతి యూనివర్శిటీ సీఐ రామయ్య కథనం మేరకు... వాసవీనగర్‌కు చెందిన ఒక యువతి బీ.టెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. ప్రసాద్ అనే యువకుడు తిరుపతిలో ట్యాక్సీ నడుపుతూ కొరమేనుగుంటలో ఉంటున్నాడు. గత కొంత కాలంగా తనను ప్రేమించాలని ఆ యువతి వెంట పడుతుండటంతో ఆమె అంగీకరించలేదు. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ తనతో పాటు కొంతమంది అల్లరి మూకను తీసుకెళ్లి వాసవీనగర్‌లో కాపురమున్న యువతి, ఆమె తల్లి, బంధువులను బెదిరించి దాడికి యత్నించారు. దీనిపై యువతి తల్లి తిరుపతి యూనివర్శిటీ సీఐ రామయ్యను కలసి ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలోకి వైసీపీ ఎంపీటీసీలు


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వెంకట్రామగౌడు, మంజునాథ్, తజ్మల్‌బాషా, గుర్రప్ప

రామకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రామకుప్పం మండలానికి చెందిన పలువురు వైసీపీ ఎంపీటీసీలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం ఆధ్వర్యంలో వారు అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. విజలాపురం ఎంపీటీసీ వెంకట్రామగౌడు, ముద్దనపల్లె ఎంపీటీసీ మంజునాథ్, రామకుప్పం-1ఎంపీటీసీ ఫిర్దోస్ భర్త తజ్మల్‌బాషా, గౌరివిమాకులపల్లె ఎంపీటీసీ సుబ్బమ్మ కుమారుడు అశోక్, పంద్యాలమడుగు ఎంపీటీసీ జయమ్మ కుమారుడు నాగభూషణం నాయక్, ఉస్సిగానిపల్లె ఎంపీటీసీ సులోచన భర్త గుర్రప్ప, సింగసముద్రం ఎంపీటీసీ అశ్విని భర్త ఆనంద్‌లను చంద్రబాబు టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని నమ్మి తాము టీడీపీలో చేరామని వారు ఈ సందర్భంగా తెలిపారు.టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజనేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, రామ్మూర్తి, చలపతి, సలాంసాబ్, నందారెడ్డి, మహ్మద్ రఫీ, రామలింగారెడ్డి, మనోహర్, విశ్వనాథ్, జయశంకర్, కృష్ణానాయక్,నాగభూషణం, జేయి, మునిరాజనాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి


రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకొంటున్న గిరిబాబు

పలమనేరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు లక్ష రూపాయలు చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్బీసీ కుట్టి, సుబ్రమణ్యం గౌడు, ఖాజాపీర్, నాగరాజు, మదన్‌మోహన్, శ్రీధర్, మాబాషా, కిరణ్, చిన్ని, సుధాకర్, సురేష్, సురేంద్ర, పర్వీన్ పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీల్లో చేర్చండి: మాజీ ఎంపీటీసీ



శాంతిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్ర బాబును 64పెద్దూరు పంచాయతీ మాజీ ఎంపీటీసీ శ్రీరాములు విన్నవించారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. కర్ణాటకలో ఎస్టీ జాబితాలో ఉన్నారని ఇక్కడ ఎస్టీల్లో కలపాలని కోరినట్లు వివరించారు. అలాగే కుప్పం వడ్డెర్లకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరామన్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వివరించారు.

9 గ్రామాల్లో గంగమాంబ ఊరేగింపు

శాంతిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బడుగుమాకులపల్లె గ్రామంలో నూతనంగా కొలువైన గంగమాంబ ఆలయ కుంభాభిషేక వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రాకంభమయ్యాయి. గంగమాంబ మూల విగ్రహాన్ని 9 గ్రామాల్లో ఊరేగించారు. అన్ని గ్రామాల్లో భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు. బుధవారం ఆలయంలో హోమాలు, కలశ పూజ నిర్వహిస్తారు.

సీసీ రోడ్లకు భూమి పూజ

శాంతిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాళ్లబూదుగూరు పంచాయతీ కేంద్రంలో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ లక్ష్మి, యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణిలు టీడీపీ నేతలతో కలిసి భూమి పూజ చేశారు. సుమారు రూ.80లక్షలు సీసీ రోడ్లకు మంజూరయ్యాయని యూనిట్ ఇన్‌చార్జి మణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పార్టీ అధ్యక్షుడు జయరాజ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బసవరాజు, కుమార్, వాజీద్, మురళి పాల్గొన్నారు.

కేజీబీవీ స్కూల్ విద్యార్థులకు కరాటే దుస్తుల వితరణ



కుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లెలోని కేజీబీవీ స్కూల్ విద్యార్థులకు మంగళవారం కుప్ప లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరాటే దుస్తులు పంపిణీ చేశారు. కరాటేలో ప్రతిభ కనబరచిన 25 మంది విద్యార్థులకు ఉచితంగా దుస్తులు ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం ద్వారా ఆడపిల్లలు ఎంతో ఆత్మవిశ్వాసంతో మెలగ వచ్చన్నారు. దుస్తులను వితరణ చేసిన మధుసూదన్‌ను అభినందించారు. కుప్పం లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేశ్, ప్రిన్సిపాల్ మాధవి, క్లబ్ డైరెక్టర్లు సెల్వం, లెనిన్, పీఈటీ స్వాతి పాల్గొన్నారు.

బావిలో పడ్డ దూడ



కుప్పం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఒక దూడ మంగళవారం ప్రమాదవశాత్తు ఒక వ్యవసాయ బావిలో పడిపోయింది. రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. కుప్పం అగ్నిమాపకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి చిన్న గాయం కూడా లేకుండా దూడను బయటకు తీసి రక్షించారు. అగ్నిమాపక సిబ్బంది రామ్మూర్తి, రెడ్డెన్న, రఘుపతి, విజయ్, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

పెద్దబజనవాడ సర్పంచ్‌పై విచారణ

గుడుపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబజనవాడ సర్పంచ్ వెంకటమ్మపై ఎంపీడీవో రాధాకృష్ణ మంగళవారం విచారణ చేపట్టారు. ఇటీవల కుప్పం తహసీల్దారు కార్యాలయంలో కలెక్టరు సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్‌లో పెద్దబజనవాడ గ్రామస్థులు సర్పంచ్‌పై ఫిర్యాదు చేశారు. పనులు చేపట్టకుండా నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దీనిపై ఎంపీడీవో గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. జిల్లా అధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఎంపీడీవో తతెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, టీడీపీ, వైసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


అభిషేక్‌నాయక్

రామకుప్పం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి సోమవారం అదృశ్యమయ్యాడు. కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్ కథనం మేరకు వివరాలు...రామకుప్పం మండలం కొర్నాల కొండకు చెందిన శేఖర్‌నాయక్ కుమారుడు అభిషేక్‌నాయక్ రామకుప్పం గిరిజన గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ఉన్న అతను సోమవారం సాయంత్రం నుంచి కన్పించలేదు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆరోగ్యసంరక్షణపై అవగాహన కల్పించాలి

బైరెడ్డిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశా కార్యకర్తలు గ్రామాల్లో అవగాహన కల్పించాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.
● అలాగే తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ ఆశా కార్యకర్తలకు తగిన సూచనలిచ్చారు. ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి


కొలమడుగులో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో కుప్పం నియోజకవర్గం రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొలమడుగు, దండికుప్పం, శివరామపురం, నంజంపేట, రెడ్లపల్లె, తుమ్మిశి తదితర గ్రామాలలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, గుంజార్లపల్లె పంచాయతీ సర్పంచ్, మాజీ మండల అధ్యక్షుడు విజయరామిరెడ్డిలు ఇతర టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. జోరుగా సభ్యత్వం చేయించారు.

నేడు ఉపాధి గ్రామసభలు

రొంపిచెర్ల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 పంచాయతీల్లో బుధవారం ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మాధుసూదనరెడ్డి తెలియజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భద్రత



చౌడేపల్లె, నవంబరు5(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తకు భద్రత ఉంటుందని ఆ పార్టీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మొబైల్‌లో టీడీపీ సభ్యత్వం నమోదు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ సభ్యత్వం చేసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షలు భీమా వర్తిస్తుందని తెలిపారు. కాగా అక్టోబరు 26న సీఎం చంద్రబాబు సభ్యత్వం నమోదు ప్రారంభించిన రోజు నుంచే మండలంలోని టీడీపీ కార్యకర్తలు వందలాది మంది స్వచ్ఛందంగా సభ్యత్వం నమోదు చేసుకుని సోషియల్ మీడియా గ్రూపుల్లో పోస్టు చేసి పార్టీపై అభిమానం చాటుకున్నారు.

దుర్గం కొండలో హోమాలు

సోమల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం దుర్గం కొండలోని ఆలయం వద్ద మంగళవారం అర్చకులు త్రివిక్రమ రామారావు ప్రత్యేక హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. శివమాలాధరణ భక్తులు సంకీర్తనలు ఆలపించారు. పెద్దఉప్పరపల్లె, రెడ్డివారిపల్లె, బోనమంద, పేటూరు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

రాత్రి జాగరణతో శివకోటి జపయజ్ఞం

సోమల, నవంబరు 5: (ఆంధ్రజ్యోతి): సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ ఇర్లపల్లె అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి శివకోటి జపయజ్ఞం చేపట్టారు. సోమల సాయిబాబా భజన మండలి, స్వయంభేశ్వరస్వామి ఆలయ భజన మండలి సభ్యులు రాత్రి జాగరణ చేస్తూ సంకీర్తనలు ఆలపించారు. మంగళవారం ఉదయం మంగళహారతితో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ మునిచంద్ర, ఆటో మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి

వి.కోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సీఐ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాగాచదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలని సూచించారు. ఇక వాహనాలను అతివేగంతో నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. అతివేగం మంచిదికాదన్నారు.

నేడు వి.కోట మండల సమావేశం

వి.కోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి: వి.కోట మండల సర్వసభ్య సమావేశం 6న బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరన్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రెండు సార్లు సమావేశం వాయిదాపడింది.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ గ్రామసభ లక్ష్యమని డిప్యూటీ తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లి సచివాలయ ప్రాంగణంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర భూముల రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. రెడ్డివారిపల్లి రెవెన్యూ గ్రామంలో రైతుల నుంచి వచ్చిన 145 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, నజీర్, ప్రభాకర్, సహదేవరెడ్డి, ఆర్ఐ దొరస్వామి పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం..నలుగురి అరెస్టు

పలమనేరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : మద్యం కేసుల్లో మంగళవారం నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ భాగ్యలక్ష్మి తెలిపారు. గంగవరానికి చెందిన కె.సుబ్రమణ్యంను అరెస్టుచేసి అతడి నుంచి 22 మద్యంసీసాలు, కలిమిచెట్ల పెంట గ్రామానికి చెందిన డి.సుబ్రమణ్యంను అరెస్టుచేసి అతడి నుంచి 25 మద్యం సీసాలు, బైరెడ్డిపల్లి వద్ద మంజునాథను అరెస్టుచేసి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే గంగవరం మండలం కేసీ పెంట గ్రామానికి చెందిన జి.ప్రభావతమ్మ నుంచి కీలపట్ల క్రాస్ వద్ద కర్ణాటకు చెందిన 37 ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసు కున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుబ్రమణ్యం, హెడ్‌కానిస్టేబుల్ దేవప్రసాద్, ఈసీ రాజేష్, డిల్లీబాబు, దశరథన్, తంబీష్, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

భూసమస్యలపై వినతుల స్వీకరణ

బైరెడ్డిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను పరిష్కరించడానికి మండలంలో నిర్వహిస్తున్న రెవిన్యూ గ్రామసభ మంగళవారం బైరెడ్డిపల్లెలో జరిగింది. రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. సర్వేయర్ రామాంజులు, వీఆర్వోలు రాజేష్, భరణి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం అమ్మాలి: డీసీ


పలమనేరు చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీసీ

కుప్పం, నవంబరు 5: ప్రభుత్వ మద్యం పాలసీ ప్రకారం ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ మద్యం దుకాణదారులను హెచ్చరించారు. కుప్పం ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీ మాట్లాడుతూ కర్ణాటక మద్యం అక్రమ రవాణా జరగకుండా ఎక్కడిక్కడ నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మద్యం దుకాణదారులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్టు దుకాణాలు ఉండ కూడదన్నారు. బెల్టు షాపునకు స్టాకు పంపిన దుకాణ లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కల్లుగీత కార్మికులకు దుకాణాలు కేటాయిస్తామన్నారు. కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్ఐ మోహన్‌బాబు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలి

పలమనేరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ చెక్‌పోస్టుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ సూచించారు. పలమనేరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలోని చెక్‌పోస్టులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్ణాటక సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన ఆలకుప్పం, వి.కోట, కేటిల్‌ఫారం చెక్‌పోస్టులను కర్ణాటక మద్యాన్ని నిలువరించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు ఆయన పలమనేరులోని బార్‌ను తనిఖీ చేశారు. పలమనేరు సీఐ భాగ్యలక్ష్మి ఉన్నారు.

ఎస్సీ బాలికలకు నూతన వసతి గృహం


బీసీ హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పలమనేరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో నూతన ఎస్సీ బాలికల వసతి గృహం నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన గుడియాత్తం రోడ్డు వద్ద ఉన్న బాలుర బీసీ వసతి గృహాన్ని సందర్శించారు. తర్వాత ఎస్సీ-1, ఎస్సీ-2 బాలుర వసతి గృహాలను, లక్ష్మీనగర్ కాలనీలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. సక్రమంగా మెనూ అందిస్తున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని భవనాలకు మరమ్మతులు చేయిస్తామని, ఎస్సీ బాలికలకు నూతన వసతి భవనాన్ని నిర్మిస్తామన్నారు. పీఆర్ఏ విద్యాసాగర్, సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజి, వార్డెన్ సోమసుందరంరెడ్డి, టీడీపీ నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, క్రిష్ణమూర్తి, బీఆర్సీకుమార్, మూర్తి, నదీమ్, కోటి, సుధాకర్, సుబ్బు, జగ్గ, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలందరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం


రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి

కల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీదేవి తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకి వారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఓపి గది, ల్యాబ్, మందుల గది, రోగుల గదులను, ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ సేవలు పటిష్ఠంగా అమలు జరగాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆశ డీసీఎం మూర్తి, వైద్యాధికారులు ఎల్లయ్య, రమ్యశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించండి


పొలంబడి కార్యక్రమంలో ఏవో అమృత తదితరులు

రామకుప్పం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని రామకుప్పం మండల వ్యవసాయాధికారి అమృత కోరారు. మంగళవారం మండల పరిధిలోని బందార్లపల్లె పంచాయతీ బగళనత్తం గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువులు తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులు, కషాయాల వినియోగంతో నాణ్యమైన అధిక దిగుబడులు, అధిక గిట్టుబాటు ధరలను పొందవచ్చన్నారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, రాఘవేంద్రనాయుడు, బాలకృష్ణారెడ్డి, హనుమంతు, రైతులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపారాధన

రామకుప్పం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని నవగ్రహ, నక్షత్ర, రాశీ వనాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కార్తీక దీపారాధన జరుగుతోంది. సోమవారం రాత్రి నుంచి కార్తీక దీపారాధనను ప్రారంభించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సదుం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మామిడిలో అధిక దిగుబడుల కోసం పూత దశ నుంచే సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మామిడి సస్యరక్షణపై రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా పూత నిలవడానికి వాడాల్సిన పోషక మందులు, తదితర అంశాలపై రైతులకు విపులంగా వివరించారు. అలాగే ప్రభుత్వం రాయితీపై మామిడి రైతులకు అందిస్తున్న వ్యవసాయ పరికరాలు, ప్యాక్ హౌస్‌ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కలికిరి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సోమశేఖర్, చౌడేపల్లె డివిజన్ ఉద్యానవన అధికారిణి సంతోషి కుమారి, ఏవో హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి కేంద్రానికి స్థల పరిశీలన



పుంగనూరు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణానికి జాయింట్ కలెక్టర్ విద్యాధరి స్థలాన్ని పరిశీలించారు. మంగళవారం స్థానిక తోపుమఠం వద్ద ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని సివిల్ సప్లైస్ గోడౌన్ తనిఖీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ రాము, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులునాయక్, వీఆర్వోలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా కిరణ్‌తేజ



పుంగనూరు రూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా కిరణ్‌తేజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. డీఈఈని అసిస్టెంట్ ఇంజనీర్లు చందన, అనూష, భుజంగం, సిబ్బంది రామమూర్తి, శ్రీరాములు, బాలాజీ సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్లపల్లె తాండాకు చెందిన నాగరాజనాయక్ కుమారుడు తేజ్‌నాయక్(27) ద్విచక్రవాహనంలో పలమనేరుకు వెళుతుండగా టోల్‌గేటు వద్ద ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. తేజ్‌నాయక్ గాయపడ్డాడు. స్థానికులు 108లో పుంగనూరు ఆస్పత్రికి తరలించారు.

జిల్లా వాలీబాల్ జట్టుకు శ్రీలత



పుంగనూరు రూరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రమాకులపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థి శ్రీలత జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీదేవి తెలిపారు. మంగళవారం మదనపల్లె జడ్పీ హైస్కూల్ ఆవరణలో అండర్-14 క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 9న విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. వ్యాయమ ఉపాధ్యాయుడు మురళీధర్, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించినట్లు తెలిపారు.

ఉన్నతస్థాయికి చేరాలి

గుడుపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి లక్ష్యాలు పెట్టుకుని ఉన్నతస్థాయికి చేరాలని కుప్పం రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్ ఆకాంక్షించారు. మంగళవారం గుడుపల్లె ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. చెడు అల వాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడారు.

పాత బస్సులను తిరిగి నడపండి

పలమనేరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ పలమనేరు డిపో నుంచి వెళ్లిపోయిన బస్సు సర్వీసులను తిరిగి తెప్పించాలని ఎన్ఎంయూ నాయకులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కోరారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కొత్త సర్వీసులను ప్రారంభించాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిపో సమస్యల పరిష్కారానికి తప్పకుండా అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆలయ భూముల ఆక్రమణపై సర్వే



చౌడేపల్లె, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ మాన్యం భూములను గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక గోసల కురప్పల్లెలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి బస్టాండు, సంతగేటు వద్ద కోట్లు విలువచేసే భూములు ఉన్నాయన్నారు. ఆ భూములు కొందరు ఆక్రమించి భవనాలు నిర్మించుకున్నారని తెలిపారు. చౌడేపల్లెకు చెందిన సుదర్శన్ ఆలయ మాన్యం భూములు ఆక్రమణలకు గురయ్యాయని, అధి కారులు పట్టించుకోవడం లేదని దేవదాయ కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దేవదాయ కమిషనర్ ఆదేశాలతో తాము ఆలయ మాన్యం భూముల ఆక్రమణలపై సర్వేలు చేయించి కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కమిషనర్ ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది హరి, భగవాన్, సర్వేయర్లు పద్మజ, చంద్రశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వాడండి: జేడీ



రైతులకు సూచనలు చేస్తున్న జేడీ మురళీకృష్ణ

తవణంపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో సేంద్రియ ఎరువులను వాడుకోవాలని జేడీ మురళీకృష్ణ సూచించారు. మంగళవారం దిగువ మాఘం పంచాయతీ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, ఏడీఏ ఉమ, ఉద్యానశాఖాధికారి సాగరిక, స్థానిక సర్పంచ్ గోపి, రైతులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని కూర్మాయిపల్లె, చిల్లగుండ్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సెరికల్చర్ ఏడీ మోహన్‌బాబు మల్బరి సాగు, పట్టుపురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. సర్పంచ్ దీప, వ్యవసాయ శాఖ అధికారి చిట్టిబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి సాదరయ్య, ఎస్‌వో వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వాడుకోవాలని రైతులకు కార్వేటినగరం వ్యవసాయాధికారి హేమలత సూచించారు. మంగళవారం కార్వేటినగరం మండలం కొల్లాగుంట, బట్టువారిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీఆర్‌నాయుడికి ఘన సన్మానం



బీఆర్‌నాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు జగన్మోహన్, థామస్

పెనుమూరు/ఐరాల/పూతలపట్టు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్‌గా నియమితులైన బీఆర్‌నాయుడు మంగళవారం స్వగ్రామమైన పెనుమూరు మండలంలోని దిగువపూనేపల్లెకు వచ్చారు. తల్లి లక్ష్మి సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ఎమ్మెల్యేలు థామస్, జగన్మోహన్, మురళీమోహన్, టీడీపీ నేతలు సీఆర్ రాజన్, దొరబాబు, చంద్రప్రకాష్, భీమనేని చిట్టిబాబు నాయుడు, మోహన్‌రాజ్, జగదీష్‌నాయుడు, రుద్రయ్య నాయుడు, హరిబాబునాయుడు, కార్జాల అరుణ, తలారి రెడ్డెప్ప తదితరులు సన్మానించారు. కాణిపాక ఆలయ అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, హేమాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారులకు తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా కొత్తకుప్పం గ్రామానికి చెందిన విమల తన కుమారుడు హరీష్‌తో కలిసి కలిసి ద్విచక్ర వాహనంలో మండలంలోని యుఎంపురంలో ఉన్న బంధువుల ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి నెలవాయి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరి



సమావేశంలో పాల్గొన్న జడ్పీ సీఈవో రవికుమార్

విజయపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ తప్పనిసరి అని జడ్పీ సీఈవో రవి కుమార్‌నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. బయోమెట్రిక్ అటెండన్స్ సరిగా వేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని చెప్పారు. డీపీవో పార్వతి మాట్లాడుతూ.. పంచాయతీలో ఇంటి పన్నుల రికార్డులు నిర్వహించాలని, పారిశుధ్య పనులు మెరుగు పరచాలని కోరారు. ఎంపీడీవో రమణప్రకాష్, ఈవోపీఆర్డీ రాజేంద్ర, పీఆర్ ఏఈఈ వీరభద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గంధం

ఇబ్బంది పడుతున్న రంగారెడ్డివీధి వాసులు



రంగారెడ్డి వీధిలో పేరుకుపోయిన చెత్త

చిత్తూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నడిబొడ్డున ఉన్న మిట్టూరులోని రంగారెడ్డి వీధిలో చెత్త పేరుకుని, దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్య కార్మికులు వారం రోజులుగా ఇక్కడకు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడి, పొడి చెత్త పేరుకుపోవడంతో దోమలు కూడా పెరిగాయని తెలిపారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అంటువ్యాధులు ప్రబలక ముందే కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నగరంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు

చిత్తూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపును నగరపాలక అధికారులు మంగళవారం చేపట్టారు. వేలూరు రోడ్డులోని దుర్గమ్మ గుడి నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న షెడ్లు, బంకులు, తోపుడు బండ్లను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని కమిషనర్ నరసింహప్రసాద్ పర్యవేక్షించారు. బుధవారం కూడా తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టి, రోడ్డుకు ఇరువైపులా చదును చేసే కార్యక్రమం చేపడుతామని ఏసీపీ నాగేంద్ర తెలిపారు. టీపీవో శుభప్రద, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి తోడ్పడండి

- ప్రవాసాంధ్రులు, పారిశ్రామికవేత్తలకు ఎమ్మెల్యే భానుప్రకాష్ పిలుపు



అమెరికాలోని ప్రవాసాంధ్రులతో మాట్లాడుతున్న భానుప్రకాష్

నగరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని అమెరికాలోని ప్రవాసాంధ్రులు, పారిశ్రామికవేత్తలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా లోవా స్టేట్ ట్రెజరర్ రాబీస్మిత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రవాసాంధ్రులైన వైద్యులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు మెరుగైన అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రాయితీలనూ ఇస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకుపోతుందన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అనుకూలంగా ఉందని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు ఆరి నవీన్, బండా హరి, కొమ్మినేని విజయ్, డాక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి దూరంగా గ్రంథాలయం

వెదురుకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో ఉన్న గ్రంథాలయం ప్రభుత్వ లక్ష్యానికి దూరంగా ఉంది. ఈ గ్రంథాలయానికి లైబ్రేరియన్‌గా మునిరాజ అనే మహిళ పనిచేస్తున్నారు. ఇక్కడ స్వీపర్ ఉన్నారు. అటెండర్ ఉద్యోగం ఖాళీ. మునిరాజనే ఎస్ఆర్‌పురానికి ఇన్‌చార్జి లైబ్రేరియన్‌గా ప్రభుత్వం నియమించింది. రెండు చోట్లా పనిచేయాల్సి రావడంతో ఈమె సరిగా రాకపోవడంతో స్వీపరే గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. దీనివల్ల పాఠకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు ఇక్కడ మౌలిక వసతులూ అంతంత మాత్రమేనని పాఠకులు వాపోతున్నారు.

సైబర్‌క్రైమ్, గంజాయి నిర్మూలనకు సహకరించండి: సీఐ

నగరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్, గంజాయి నిర్మూలనకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సహకరించాలని నగరి సీఐ మహేశ్వర్ పిలుపునిచ్చారు. నగరి మండల పరిషత్ క్యాంపస్ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో సైబర్‌క్రైమ్, గంజాయి నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలు సెల్‌ఫోన్లతో ఏమి చేస్తున్నారో గమనించితే సైబర్‌నేరాలు తగ్గుతాయన్నారు. ఓజీకుప్పంలో గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టామని చెప్పారు. గంజాయి విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

స్కంద షష్ఠి ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

నగరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి ఆలయంలో స్కందషష్ఠి ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం స్వామికి ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ పూజలు చేయగా, ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పరిశీలించారు.

మరిన్ని ఆర్టీసీ బస్సులు తీసుకొస్తాం: జగన్మోహన్



టీడీపీ నేతలతో కలిసి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు మరిన్ని ఆర్టీసీ బస్సులు తీసుకొస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళకండ్రిగ పరిసర గ్రామాలకు ఒకటి, బెంగళూరుకు మరొకటి కలిపి రెండు సర్వీసులను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇప్పటి వరకు 38 నూతన సర్వీసులను ప్రారంభించడం జరిగిందన్నారు. అదే వైసీపీ ప్రభుత్వంలో ఒక్క బస్సును తీసుకొచ్చింది లేదని మండిపడ్డారు. అలాగే వైసీపీ ప్రభుత్వంలో అనేక గ్రామాలకు నిలిచిపోయిన సర్వీసులను పునరుద్ధరిస్తామన్నారు. అనంతరం ప్రారంభించిన బస్సును ఆయన నడిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ నేత చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి : సీపీఎం

చిత్తూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 8 నుంచి 14వ తేదీవరకు జరగనున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే సమస్యలను కూడా గుర్తించామని వాటిపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నాయకులు ఓబుల్‌రాజు, గిరిధర్, భువనేశ్వరి, షకీలా తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు మెంబరుకు సన్మానం



వెదురుకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు మెంబరు భానుప్రకాష్‌రెడ్డిని వెదురుకుప్పం బీజేపీ నాయకులు సన్మానించారు. మంగళవారం ఆయన్ను తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోడిరెడ్డి హనుమంతరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



రోగులతో మాట్లాడుతున్న హనుమంతరావు

గంగాధరనెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పీహెచ్‌సీని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో హనుమంతరావు తనిఖీ చేశారు. ఐదేళ్లలోపు పిల్లల్లో ఇంకా ఎవరికైనా వ్యాక్సినేషన్ చేయాల్సి ఉంటే మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంలో పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆశ వర్కర్లతోనూ సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. డాక్టర్ దుర్గాదేవి, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ధర్మేంద్ర, షైలా, ఫార్మసిస్ట్ నాగలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జయకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ షానవాజ్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



ఎంపీ పార్థసారథి, సాయిధరమ్‌తేజ్‌కు జ్ఞాపిక అందిస్తున్న రవీంద్రబాబు, వాసు

ఐరాల(కాణిపాకం), నవంబరు5 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి మంగళవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ప్రముఖ సినీనటుడు సాయిధరమ్‌తేజ్ కూడా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

నగరిలో అక్రమ క్వారీలను రద్దు చేయాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నగరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరి పరిధిలోని అక్రమ క్వారీలను తక్షణం రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మైనింగ్ అధికారులు మొద్దునిద్రలో ఉన్నారని జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి జనార్దన్ విమర్శించారు. పైగా నిబంధనలను తుంగలో తొక్కి క్వారీలకు అనుమతులిస్తున్నట్లు ఆరోపించారు. వేలన్ అధ్యక్షతన జరిగిన నిరసన దీక్షలో నేతలు శ్రీరాములు, షబ్బీర్ బాషా, విజయకుమార్, రాజేంద్ర, ఏసు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా 'నగరి' సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

నగరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరి మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు గందరగోళం మధ్య నిర్వహించారు. వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులను చెల్లించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. అధికారపార్టీకి అనుకూలంగా ఎంపీడీవో వ్యవహరిస్తున్నారని, గోశాలలు ఎవరి అనుమతులతో మంజూరు చేశారని ప్రశ్నించారు. అధికార పార్టీతో సమానంగా అందరికీ అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ భార్గవి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ రవికుమార్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగులచవితి



సంతపేట నాగాలమ్మ ఆలయం వద్ద మహిళల పూజలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను మంగళవారం నగరవాసులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గిరింపేటలోని ఎస్పీఎస్ వద్ద ఉన్న పుట్ట వద్ద పూజలు చేశారు. అలాగే సంతపేట నాగాలమ్మ, దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక, గిరింపేట దుర్గాంబ, తేనెబండ ముత్యాలమ్మ, ఇందిరానగర్ నాగాలమ్మ, ఇరువారం నాగేంద్రస్వామి, కామాక్షి సమేత అగస్తీశ్వర, కులందేశ్వర, రాజుగుడుల్లోనూ నాగదేవతలకు భక్తులు పూజలు చేశారు.

నగరి: ఓంశక్తి ఆలయ సమీపంలో ఉన్న నాగాలమ్మ, బాలాజీ గోల్డెన్‌సిటీలో ఉన్న ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్తంగా..

నేడు హుండీ లెక్కింపు

తవణంపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరుగుతుందని సిబ్బంది తెలిపారు. అలాగే ఆలయంలో నిరుపయోగంగా ఉన్న 520 కిలోల ఇనుము, 150 కిలోల ప్లాస్టిక్‌ను బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాలసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం పాలసముద్రం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు అరుణ, లక్ష్మి, గంగా, రేవతి, కమల పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పాలసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీవో మహేష్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ వస్తారని, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా మునిరత్నం



నగరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా నగరికి చెందిన మునిరత్నం ఎంపికయ్యారు. ఈయన ఎంపికపై మండల యూటీఎఫ్ కార్యవర్గసభ్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

విజయపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాతార్కాడు ప్రాథమిక పాఠశాలలో సర్వే చేసి ప్రహరీ నిర్మించాలని వైసీపీ నేత సతీష్‌యాదవ్ మంగళవారం ఎంపీడీవో రమణప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. పాఠశాల స్థలం దుర్వినియోగం కాకుండా చూడాలని కోరగా, ఎంపీడీవో పరిశీలిస్తామన్నారు.

బంగారమ్మకు పూజలు



వెదురుకుప్పం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమ అభిషేకం చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు.

అన్నదానానికి రూ.1.50 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన సంతోష్‌కుమార్, సుమ పేరిట వారి కుటుంబీకులు మంగళవారం రూ.1,50,116 విరాళంగా అందించారు. వీరిని సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

'రైతుల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోండి'

గంగాధరనెల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అగరమంగళంకు సమీపంలో ఉన్న అంకాల పరమేశ్వరి గుడికోసం పక్కనున్న రైతుల భూములను ఆక్రమించుకున్న ఆలయ ట్రస్ట్ దీపక్‌కుమార్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బండి పట్టాభిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు రామ్‌ప్రకాష్, ఆనందబాబు, స్టీఫెన్, వరప్రసాద్‌లతో కలిసి మంగళవారం వినతిపత్రమిచ్చారు.